క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

నందలూరు : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అన్నమయ్య జిల్లా - ఉపాధి కల్పన వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (ఎస్‌ఈఈఈడీఏపీ) ఆధ్వర్యంలో మంగళవారం ఆకేపాడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పేటీఎం, ఎస్‌బీఐ కార్డ్స్, సూపర్ కె, టాటా ఏఐఏ, ఆదర్శ ఆటో వరల్డ్, మారుతి సుజుకి, ఏయు స్మాల్ ఫైనాన్స్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఆసక్తి గల నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఒరిజినల్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9676736623, 9381695985 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పుల్లంపేట: ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రస్థావరాలపై దాడి జరిపి భారతదేశ ప్రతిష్టను నిలబెట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. ఆదివారం ఎస్‌బీవీడీ సభా హైస్కూల్ నుంచి సాయుధ బలగాలకు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రస్థావరాలపై దాడి జరిపి భారతదేశ ప్రతిష్టను నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట బీజేపీ మండల అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, పట్టుపోగుల ఆది నారాయణ, కంబాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లి: ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాటం చేయాలని సీపీఐ నాయకులు పండుగోల మణి, జ్యోతి చిన్నయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గోవిందంపల్లి పంచాయతీలో సీపీఐ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవిందంపల్లి పంచాయతీ, శంకరాపురం దళితవాడ గ్రామంలో గృహాలపై నుంచి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని, తద్వారా గ్రామంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈనెల 25వ తేదీలోపు కొత్తలైన్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించకుంటే కొర్లకుంట సబ్‌స్టేషన్‌ను సీపీఐ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే వాటర్ ట్యాంక్ కట్టి 15 సంవత్సరాలు గడిచినా ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల నాగేశ్వరరావు, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి మోడి శివయ్య, మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

నివాళి



అబ్దుల్ మునాఫ్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లి: మాజీ సమితి కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మునాఫ్ మృతికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి సంతాపం తెలిపారు. రాయచోటి పట్టణంలోని అలీమాబాద్ వీధిలోని నివాసంలో ఆదివారం అబ్దుల్ మునాఫ్ మృతదేహాన్ని శ్రీకాంత్ రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు షబ్బీర్, సయ్యద్ అమీర్, ఇనాముల్లా, యూసుఫ్ ఖాన్, నాదర్, భక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు

సిద్దవటం: సిద్దవటంలో శనివారం రాత్రి వీచిన గాలులకు, వర్షానికి బీసీ బాలికల హాస్టల్‌లోని చెట్లు పడిపోడంతో హాస్టల్ గేటు, ప్రహరీ గోడ దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న వసతి గృహం అధికారి లక్ష్మీదేవి, అసిస్టెంటు బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలులు, వర్షాలు కారణంగా హాస్టల్ ఆవరణంలోని పెద్ద చెట్టుపడి పోవడంతో ప్రహరీతో పాటు హాస్టల్ గేటు నేమ్ బోర్డు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. సోమవారం ప్రహరీ నిర్మాణ పనులకు అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి నిర్మాణ పనులను చేపడతామని పేర్కొన్నారు. ఇన్‌చార్జి వార్డెన్ లక్ష్మీదేవి, అటెండర్ అమల, వాచ్‌మెన్ పెంచలమ్మ పాల్గొన్నారు.

కొత్తకార్డుకు కష్టాలు!

- అవస్థలు పడుతున్న దరఖాస్తుదారులు
- మ్యాపింగ్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- కొత్త కార్డుల జారీకి హౌస్ మ్యాపింగ్ కీలకం
- మ్యారేజ్ సర్టిఫికెట్‌కు తంటాలు



గాలివీడు : కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కుటుంబసభ్యుల మ్యాపింగ్ ఒకేచోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావట్లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సర్టిఫికెట్ కోసం ఎప్పుడో మ్యారేజ్ అయిన వాళ్లు సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు వెళితే రూ.3 వేల నుంచి, రూ.5 వేలు ఖర్చు అవుతున్నాయని దరఖాస్తుదారులు వాపోతున్నారు. కార్డులో పిల్లల చేర్పు, కొంతమంది తొలగింపులో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బయోమెట్రిక్ పడనిచోట పరిస్థితి ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకునే విధానంలో కొన్ని నిబంధనలను తప్పనిసరిగా సడలించాలని ప్రజలు కోరుతున్నారు. దరఖాస్తుల స్వీకరణలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనాలు

కూటమి ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీ, కార్డుల విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్ కార్డులు ఉన్న వారు వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డులకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగంటూ పలువురు వాపోతున్నారు

మ్యాపింగ్‌తో తీవ్ర ఇబ్బంది

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ ఉండాలి. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పుడు వలంటీర్లు చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

బయోమెట్రిక్స్ పడకుంటే కార్డు రానట్టే!

కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్ లైన్ కావట్లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడని వారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

విభజనలో కొత్త కష్టాలు

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరినే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది.

ఆధార్ చిరునామాతోనే..

ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్‌లో తీసుకోవట్లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్‌లో ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది. చిన్నారుల బాల ఆధార్ అప్‌డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండట్లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు ఇవ్వాలని కోరుతున్నారు.

కనుల పండువగా పుష్పయాగం



లక్ష్మీనరసింహస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

పెనగలూరు: మండలంలోని ఈటమాపురం పెంచల నరసింహస్వామి కొండపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. తిరుపతి-తిరుమలకు చెందిన బాలాజీ స్వామి ఆధ్వర్యంలో 11 మంది వేదపండితులు ఈ పుష్పగాయాన్ని నిర్వహించారు. ఆలయ వైస్ చైర్మన్ బత్తిన పెద్ద గుండాల్ రెడ్డి, మహేశ్వరమ్మ దంపతులు ఈ పుష్పయాగాన్ని నిర్వహించారు. పుష్పగాయానికి వచ్చిన భక్తులకు టీటీడీ వారిచే కోలాటం, అన్నమయ్య కీర్తనలు ఏర్పాటు చేశారు. అనంతరం పెద్ద గుండాల్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



పుష్పయాగ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మామిడి రైతుకు దిగులు

- దిగుబడి లేదు.. మార్కెట్టూ లేదు
- ధరల పతనంతో కుదేలైన మామిడి రైతు
- ప్రభుత్వం ఆదుకుంటుదని ఆశగా చూస్తున్న రైతన్న



గాలులకు నేలరాలిన మామిడి కాయలు

లక్కిరెడ్డిపల్లి: మధురఫలం మామిడి.. పండించే రైతుకు చేదునే మిగులుస్తోంది. ఏటా ఈసారి కలిసి స్తుందని భావిస్తున్న రైతులకు అననుకూల వాతావరణ పరిస్థితులు, దళారీల ప్రభావంతో నిరాశే మిగులుతోంది. ప్రస్తుత సీజన్‌లో అననుకూల వాతావరణ పరిస్థితులు, చీడ పీడల ఉధృతితో మామిడి దిగుబడి గణనీయంగా పడిపోయింది. దీనికితోడు అకాల వర్షాల వల్ల వీచిన ఈదురు గాలులకు చేతికి వచ్చిన పంట నేల రాలిపోయింది. ఆశించిన స్థాయిలో మామిడిపండ్లు లేక.. తమకు నష్టాలు తప్పడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అక్కరకు రాని పంటల బీమా

ఉద్యానశాఖ అధికారుల ఆదేశాలతో మామిడి రైతుకు ఇన్సూరెన్సు ఆశ చూపుతూ ఎకరానికి రూ. 2,250 చెల్లించారు. రాష్ట్రప్రభుత్వం మామిడి రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రస్తుత సీజన్‌లో మామిడి రైతుకు అంతగా ఉపయోగపడలేదు. ఈ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతు సేవా కేంద్రాల ద్వారా బీమాను కట్టించాల్సిన అధికారులు ఆ పని చేయడంలో విఫలం చెందడంతో ప్రస్తుతం దెబ్బతిన్న రైతులకు పంటల బీమా ఉపయోగపడని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వం ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లి మండలంలో వందల హెక్టార్‌లలో మామిడి సాగు చేశారు. ప్రతి ఏడాది నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. దీనికితోడు ధర లేదని వ్యాపారస్తులు రైతులను దోచుకుంటున్నారు. మధ్యలో దళారి వ్యవస్థతో మామిడి రైతుకు ఒరిగేదేమి లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఉద్యానశాఖ అధికారులు మాత్రం తమ చేతుల్లో ఏమి లేదు అన్నట్లు వ్యవహరిస్తూ ఉన్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పరిహారం చెల్లించాలి



మామిడి రైతుకు ఇన్సూరెన్సు చెల్లించాలి. వాతావరణ ఆధారిత బీమా పథకం క్రింద రూ. 2,250 చెల్లించాము. రాలిపోయిన మామిడి కాయలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. ప్రభుత్వం మామిడి రైతుకు చేయూత అందించాలి. ఉద్యానశాఖ అధికారులు అంచనా వేసి మామిడి రైతుకు పరిహారం అందజేయాలి.

–వెంకటనారాయణ రెడ్డి, మామిడి రైతు, గుడ్లవారిపల్లి, లక్కిరెడ్డిపల్లి మండలం

దళారులు దోచుకుంటున్నారు



నాకు ఐదు ఎకరాలు మామిడితోట ఉంది. ఈ ఏడాది నెల వ్యవధిలోనే నాలుగు సార్లు వీచిన ఈదురు కాయలు రాలిపోయాయి. రాలిన మామిడి కాయలకు మార్కెట్‌లో రేటు లేకపోవడంతో నష్టం వచ్చింది. రేటు లేకపోవడంతో దళారీలు దోచుకుంటున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి.

–సుబ్బయ్య, గురవయ్యగారిపల్లి, లక్కిరెడ్డిపల్లి మండలం

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎమ్మెల్యే ఆకేపాటి తదితరులు



వరుడితో పి.రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

నందలూరు : మండలంలోని నల్లతిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు వివాహ వేడుకలో ఆదివారం వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే నల్ల తిమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన మినీగ వెంకటసుబ్బయ్య కుమారుడు వెంకటకిశోర్‌కు నూతనంగా వివాహం జరిగింది. వారి స్వగృహంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. గడికోట సుబ్బారెడ్డి, గీతాల నరసింహారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: కడప-రాయచోటి రోడ్డులోని కడప కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన 'సాక్షి' సీనియర్ ఫొటోగ్రాఫర్ రఫీ కుమార్తె వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు చిత్తూరు ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాయచోటి మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్ రెడ్డి, కడప డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంలున్నారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ నేత సుభాన్ బాషా, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, జమాల్ వలి, దాసరి శివ, కార్పొరేటర్లు పాకా సురేష్, బాలస్వామి రెడ్డి, చాంద్ గౌస్, షఫీ, ఆరిఫ్, డివిజన్ ఇంచార్జ్ మున్నా వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి
- వైభవంగా మంచాలమ్మ జాతర



సంబేపల్లె : జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

సంబేపల్లె : మంచాలమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మండల పరిధిలోని నారాయణరెడ్డి గ్రామంలోని మంచాలమ్మ జాతర సందర్భంగా గ్రామంలోని సుద్దవాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజ, దివాకర్ ఇచ్చిన విందులో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, రాయచోటి జెడ్పీటీసీ వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ డీసీసీబీ సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, బీసీ నాయకుడు నాగరాజయాదవ్, శివశంకర్‌యాదవ్, శివశంకర్ యాదవ్, జేసీఎస్ మండల కన్వీనర్ వి.వి.రమణారెడ్డి, అమరనాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమణ, అంజి, రమేష్, ఓబులేసు పాల్గొన్నారు.

ముగిసిన వీరాంజనేయ స్వామి తిరునాల

మండల పరిధిలోని గుట్టపల్లె సమీపంలో వెలసిన వీరాంజనేయస్వామి తిరునాల ఆదివారం ఘనంగా ముగిసింది. శనివారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మొక్కుబడులు తీరిన భక్తులు రాత్రికి చాందనీబండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. తిరునాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

జాతరలు మన సంస్కృతికి ప్రతీకలు

రాయచోటి టౌన్ : జాతరలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం గ్రామంలోని మూలగంగమ్మ తల్లి జాతర సందర్భంగా ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లపు రమేష్, సైకం రమేష్‌రెడ్డి, దివాన్, మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపు

జాతర సందర్భంగా మాధవరం గ్రామంలోని ఏకలనాయుళ్ల కుటుంబసభ్యులు ఇచ్చిన విందులో గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. కుటుంబసభ్యులను ఆయన పేరుపేరునా పలకరించిన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గురికాని వాండ్లపల్లె ఎంపీటీసీ కణినేని నాగవేణి విశ్వనాథనాయుడు, నాగార్జున నాయుడు, మనోహర్ నాయుడు, పేయలవాండ్లపల్లెకు చెందిన భాస్కర్ నాయుడు, రామ్మోహన్ నాయుడు, ఎంపీటీసీ సహదేవమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు భుట్టో ఖలీల్, షబ్బీర్, కదిరీపతి, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైభవంగా ఇరుగులమ్మ తిరునాల

సిద్దవటం: సిద్దవటం గ్రామ శివారులోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున వెలసిన ఇరుగులమ్మ తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఇరుగులమ్మ దేవతకు అభిషేకం, అలంకరణ, , కుంకుమార్చన, ఆకుపూజతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాలకు వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం సిద్దవటం గాంధీ వీధి కళాకారులు కోలాటం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన జగనన్న

గాలివీడు: రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసి వారి గుండెల్లో మాజీ ముఖ్యమంత్రి జగనన్న చిరస్థాయిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కొనియాడారు. చౌడేశ్వరీదేవి జాతర సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని మండల ప్రజల సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరువాక సమీపిస్తున్న తరుణంలో రైతులకు వేరుశనగ, ఎరువులు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మామిడి, దోస, టమాటా, ఖర్బూజ రైతులకు ఆదుకోవాలని కోరారు. అనంతరం గాలివీడు వైస్ ఎంపీపీ గాలి శ్రీనివాసులు సోదరుడు వెంకట రమణ కుమార్తె వివాహ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పూలుకుంట ఎంపీటీసీ సభ్యుడు గడ్డం చంద్రప్రకాశ్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ ఆవుల నాగభూషణరెడ్డి, ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ పార్టీ కన్వీనర్ యదుభూషణ్‌రెడ్డి, సర్పంచులు ఉమాపతిరెడ్డి, దీప్తి వెంకటాద్రి, చెన్నకేశవరెడ్డి, డేరంగుల నారాయణ, మాజీ సర్పంచ్ వెంకట నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు మన్సూర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన జాతర

చిన్నమండెం : మండల పరిధిలోని చాకిబండ, కలిబండ గ్రామాల్లో కొలువై ఉన్న అమ్మవార్ల జాతర ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా చాకిబండ గ్రామంలోని ఎల్లమ్మ తల్లి, కలిబండ గ్రామంలో కొలువై ఉన్న పాలేటమ్మ ఆలయాలలో అమ్మవార్లలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవార్లకు చాందినీబండ్లను ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

చిన్నమండెం : సమష్టి కృషితో వైఎస్సాఆర్‌సీపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. మండలంలోని దిగువగొట్టివీడు గ్రామం దిన్నెమీదపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు భైరవనాథరెడ్డి ఇచ్చిన విందులో శ్రీకాంత్‌రెడ్డి, దేవనాధరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ రాజమ్మ, సంబేపల్లె వాసుదేవరెడ్డి, వైఎస్సాఆర్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, రామ్మోన్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, గురుమూర్తి, మల్‌రెడ్డి, వెంకటరమణ, భూషణ్, రమణ, కంబళ్ల రమణ, వెంకటేష్, జనార్దన, గురుమూర్తి, సలీం పాల్గొన్నారు.



సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ తల్లి



సంబేపల్లె : తిరునాలలో ఆకట్టుకున్న కోలాటాలు, చాందినీ బండ్లు



చిన్నమండెం: ఊరేగింపుగా వస్తున్న చాందినీబండ్లు



చిన్నమండెం: సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి జగదాంబసెంటర్ : పినాక సాధికార ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐఆర్ఎస్ అధికారి యాదగిరి పర్యవేక్షణలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మోటివేషనల్ టాపిక్స్‌పై నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని శ్రీ షిర్డీ సాయి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతులలో ఫ్రీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు కోర్స్ డైరెక్టర్స్ కోటకొండ రఘు, గొనిపల్లి శివ తెలిపారు. మరిన్ని వివరాలకు 9550136976, 9533595593 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మురళీమోహన్, ప్రముఖ న్యాయవాది ఈశ్వరయ్య, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు, ఉపాధ్యాయులు రామ్మోహన్, రాజేంద్ర, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, గొని మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

రాయచోటి టౌన్ : సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాయచోటి సహకార ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 15 నెలలుగా డీసీపీబీ నుంచి జీతాలు, అరియర్స్ రావడం లేదని పేర్కొన్నారు. ఐదేళ్లుగా పీఆర్‌సీ కూడా రాలేదని చెప్పారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిసమస్యలుపరిష్కరించాలని కోరారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) కౌన్సిల్ సమావేశ వాల్ పోస్టర్‌ను రాష్ట్ర రవాణ, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఏపీజీఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ మాట్లాడుతూ జూన్ 5వ తేదిన విజయవాడలో ఏపీజీఈఏ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంయుక్త కార్యదర్శి వలి, సుజిత్ దాల్, రఘు,రవీంద్ర,చంద్రశేఖర్,వేణు,హరీష్, చంద్రమోహన్, రమేష్, పాల్గొన్నారు.